ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 271 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

శుక్రవారం 02 మే 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

పహల్గాం దర్యాప్తు

:కాందహార్ హైజాక్ నిందితుడి ఇంట్లో సోదాలు

పహల్గాం దర్యాప్తును ఎన్ఐఏ వేగవంతం చేసింది. ఈ క్రమంలో ఐసీ 814 హైజాక్ సందర్భంగా విడుదలైన ఓ ఉగ్రవాది ఇంటిని తనిఖీ చేసింది.

మే 2, (రిపబ్లిక్ న్యూస్): పహల్గాం దాడి తర్వాత కశ్మీర్లో భద్రతా దళాలు గాలింపు చర్యలను వేగవంతం చేశాయి. తాజాగా ఐసీ 814 విమానాన్ని హైజాక్ చేసిన అల్ ఉమర్ ముజాహిద్దీన్ చీఫ్ ముష్తాక్ అహ్మద్ జర్గర్ను ఉగ్రవాదులు విడిపించిన నేపథ్యంలో అతని ఇంట్లోను భద్రతా దళాలు సోదాలు చేశాయి. ప్రస్తుతం అతడు పాకిస్థాన్లో ఉంటున్నాడు. కీలక ఆధారాల కోసం సోదాలు చేపట్టారు. గత వారం 60 ఇళ్లపై ఎన్ఐఏ బృందాలు దాడులు నిర్వహించాయి. ఈసందర్భంగా మొత్తం ఇప్పటివరకు 1900 మందిని ప్రశ్నించాయి.

టెక్ సాయం..

పహల్గాం దాడికి సంబంధించి సీన్ రీ కన్స్ట్రక్షన్ చేసేందుకు ఎన్ఐఏ అత్యాధునిక విధానాలు వినియోగిస్తోంది. శాటిలైట్ ఇమేజ్లు, డ్రోన్ దృశ్యాలు, బాధితులు, గుర్రపు స్వారీ ఆపరేటర్ల నుంచి సమాచారం సేకరిస్తోంది. దీంతోపాటు దాడి జరిగిన ప్రదేశాన్ని హైరిజల్యూషన్ 3డీ మోడల్ను కూడా తయారుచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మోడల్ దర్యాప్తును కోర్టులో విచారణకు ఉపయోగించనుంది. ఘటనా స్థలం నుంచి ఇప్పటివరకు 40 ఖాళీ తూటాలను దర్యాప్తు బృందాలు స్వాధీనం చేసుకొన్నాయి. అంతేకాదు.. మొబైల్ టవర్స్ నుంచి పాత డేటాను మొత్తం దర్యాప్తు బృందాలు వెలికితీస్తున్నాయి.

లష్కరే ప్లాను పాక్ ఐఎస్ఐ సాయం..

బైసరన్ లోయలో పర్యాటకులను హత్య చేయాలన్న పథకాన్ని ప్రాథమికంగా లష్కరే తోయిబా రూపొందించిందని జాతీయ దర్యాప్తు సంస్థ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. దీనికి ఐఎస్ఐ ఆపరేటివ్ల సాయం చేయగా.. దీనికి పాక్లోని లష్కరే ప్రధాన కార్యాలయంలో తుదిరూపు వచ్చింది. ఈ మొత్తం దాడికి లష్కరే ఉగ్రవాది హషీమ్ ముసా, అలీభాయ్లు కేంద్రంగా నిలిచినట్లు అంచనా వేసింది. వీరిద్దరూ పాక్ జాతీయులే. ఈ ఉగ్రవాదులకు 2024లో జరిగిన గగనగర్ ఉగ్రదాడితో సంబంధం ఉందని దర్యాప్తు బృందాలు బలంగా విశ్వసిస్తున్నాయి. అయితే వీరు చీనాబ్ లోయ వైపు నుంచి వచ్చి ఉండనందున, అటువైపు వెళ్లి ఉండకపోవచ్చని భావిస్తున్నాయి.

సరిహద్దుల్లో తగ్గని ఉద్రిక్తత..

వరుసగా 8వ రోజు కూడా పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. అంతర్జాతీయ సరిహద్దుల వెంట కాల్పులు జరిపింది. వీటిని భారత్ బలంగా తిప్పికొట్టింది. దీంతోపాటు సరిహద్దుల వెంట ఉన్న బంకర్లను శుభ్రం చేసి.. స్థానికులు ఆశ్రయం పొందేందుకు వీలుగా సిద్ధం చేస్తున్నారు.

సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీకోర్టు నోటీసులు

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది.

దిల్లీ, మే 2, (రిపబ్లిక్ న్యూస్): నేషనల్ హెరాల్డ్కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు దిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఛార్జిషీట్పై న్యాయబద్ధమైన విచారణ జరిగే సమయంలో ఎప్పుడైనా అవతలి పక్షంవారు తమ వాదనలు వినిపించే హక్కు ఉంటుందని ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నే అన్నారు. దీనిపై తదుపరి విచారణను మేరికి వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

కొత్త చట్ట నిబంధనల ప్రకారం నేషనల్ హెరాల్డ్కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో నిందితులను విచారించకుండా ఛార్జిషీట్ను పరిగణనలోకి తీసుకోలేమని.. కాబట్టి విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఈడీ ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. గతవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఈడీ సమర్పించిన ఛార్జిషీట్లో సరైన పత్రాలు లేని కారణంగా రాహుల్, సోనియా గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ చర్యలు తీసుకుంది. 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీవల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఆస్తులున్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది. కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లెయింట్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు విచారణ చేపట్టింది.

రాజధాని పునఃనిర్మాణ వేడుక.. నిండిపోయిన గ్యాలరీలు..

రాజధాని అమరావతి ప్రాంతంలో పండుగ శోభ నెలకొంది. రాజధాని పునఃనిర్మాణ వేడుకకు శుక్రవారం ఉదయం నుంచే అమరావతి ప్రాంత రైతులతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు.

అమరావతి, మే 2, (రిపబ్లిక్ న్యూస్): రాజధాని అమరావతి ప్రాంతంలో పండుగ శోభ నెలకొంది. రాజధాని పునఃనిర్మాణ వేడుకకు శుక్రవారం ఉదయం నుంచే అమరావతి ప్రాంత రైతులతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇప్పటికే సభావేదిక వద్ద గ్యాలరీలన్నీ నిండిపోయాయి. తెదేపా, జనసేన, భాజపా నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. మరోవైపు సభావేదిక వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వంద పాకిస్థాన్లు వచ్చినా భారత్‌ను ఏమీ చేయలేరు:లోకేశ్

ఒక్క పాకిస్థాన్ కాదు.. వంద పాకిస్థాన్లు వచ్చినా భారత్‌ను ఏమీ చేయలేరని మంత్రి నారా లోకేశ్ అన్నారు.

అమరావతి, మే 2, (రిపబ్లిక్ న్యూస్): ఒక్క పాకిస్థాన్ కాదు.. వంద పాకిస్థాన్లు వచ్చినా భారత్ను ఏమీ చేయలేరని మంత్రి నారా లోకేశ్ అన్నారు. భారత్ వద్ద మోదీ అనే మిసైల్ ఉందన్నారు. అమరావతి పునఃనిర్మాణ సభలో అమరావతి నమో నమఃఅని రెండు సార్లు అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.

"నమో కొట్టే దెబ్బకు పాకిస్థాన్ దిమ్మ తిరగడం ఖాయం. భారత గడ్డపై గడ్డి మొక్క కూడా పీకలేరు. మోదీకి ఏపీ అంటే ప్రత్యేక అభిమానం. ఏపీ ప్రాజెక్ట్ కు ఆమోదం చెబుతూ మద్దతు ఇస్తున్నారు. 2014లో మనల్ని మెడపట్టి గెంటేశారు. రాజధాని కూడా లేకుండానే విడిపోయాం. చంద్రబాబు ఆత్మస్థైర్యం కోల్పోకుండా రాష్ట్రాన్ని నిలబెట్టారు. చంద్రబాబుపై కోపంతో కొందరు రాజధానిని పక్కనబెట్టారు. అమరావతికి అండగా ఆంధ్రా ప్రజలంతా నిలబడ్డారు" అన్నారు. "ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా అమరావతి రైతులు తగ్గేదే లే అన్నారు. గత ప్రభుత్వం దొంగ కేసులు పెట్టి ఎన్ని కుట్రలు చేసినా జై అమరావతి నినాదాలను మాత్రం ఆపలేకపోయింది. ఆపేదానికి.. పీకేదానికి అమరావతి ఎవరి ఇంట్లోనో పెంచుకున్న మొక్క కాదు.. జనం గుండెల్లో దాచుకున్న ప్రజా రాజధాని. రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. అమరావతి అన్ స్టాపబుల్' అన్నారు.

గవర్నర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపిన కాంగ్రెస్ నేతలు

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయం.. రాహుల్ గాంధీ కృషి ఫలితమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

హైదరాబాద్, మే 2, (రిపబ్లిక్ న్యూస్): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయం.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కృషి ఫలితమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపినందుకు కాంగ్రెస్ నేతలు రాజ్భవన్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

తెలంగాణ రాష్ట్రం కులగణన చేసి ప్రామాణికంగా స్పష్టమైన లెక్కల్ని వెల్లడించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ విషయంలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎవరెన్ని మాట్లాడినా... కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణన, కులగణన చేపడుతోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్ పేర్కొన్నారు. చౌకబారు విమర్శలు చేసేవారు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కులగణనను తాము ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. గవర్నర్ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ విజయశాంతి, కాంగ్రెస్ సీనియర్ నేతలు వీహెచ్, మధుయాష్కి తదితరులు ఉన్నారు.

తరతరాలు గర్వపడేలా అమరావతిని నిర్మిస్తాం : మంత్రి నారాయణ

ఏపీ కలల రాజధాని అమరావతిని తరతరాలు గర్వపడేలా నిర్మిస్తామని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు.

అమరావతి, మే 2, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ కలల రాజధాని అమరావతిని తరతరాలు గర్వపడేలా నిర్మిస్తామని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సభలో ఆయన ప్రసంగించారు. "పదేళ్ల క్రితం ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పురుడు పోసుకుంది. పునఃప్రారంభం కూడా ఆయన చేతుల మీదుగా జరగడం మన అదృష్టం.

గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన ఒకే ఒక్క పిలుపుతో 29 గ్రామాల్లో 29,373మంది రైతులు కేవలం 58 రోజుల్లోనే ఒక్క సమస్య కూడా లేకుండా 34 వేల ఎకరాల భూమిని అమరావతి కోసం త్యాగం చేయడం దేశ చరిత్రలోనే ప్రథమం. అమరావతి రైతుల త్యాగం వెలకట్టలేనిది. అమరావతి కోసం ఎన్నో త్యాగాలు చేసిన రైతులకు నా పాదాభివందనం" అన్నారు. "ప్రపంచంలోనే టాప్ 5 రాజధానుల్లో ఒకటిగా అమరావతిని నిర్మించాలనే లక్ష్యంతో 2014-19లోనే రూ.40వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించాం. దాదాపు రూ.9వేల కోట్ల పనులు పూర్తి చేశాం. గత ప్రభుత్వం నిర్వాకంతో గత ఐదేళ్లలో రాజధాని పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వస్తే అమరావతిని పూర్తి చేస్తామని కూటమి తరఫున ఎన్నికల ముందు చెప్పాం. ప్రధాని ఆశీస్సులతో సీఎం చంద్రబాబు సారథ్యంలో మూడేళ్లలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటాం" అని మంత్రి నారాయణ అన్నారు.

దివిసీమ తుపానులా అమరావతిని వైకాపా తుడిచేసింది:పవన్

అమరావతి రైతులు గత ఐదేళ్లుగా నలిగిపోయి.. లాఠీ దెబ్బలు తిన్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

అమరావతి, మే 2, (రిపబ్లిక్ న్యూస్): అమరావతి రైతులు గత ఐదేళ్లుగా నలిగిపోయి.. లాఠీ దెబ్బలు తిన్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతి పునఃనిర్మాణం సభలో ఆయన ప్రసంగించారు. గతంలో రైతులను కలిసినప్పుడు 'మా కన్నీళ్లు తుడిచేదెవరు' అని అడిగినట్లు గుర్తు చేసుకున్నారు. అమరావతి ఐదు కోట్ల మందికి సంబంధించిన హబ్ అని అభివర్ణించారు.

దేశమే తన కుటుంబంగా మోదీ భావిస్తున్నారని కొనియాడారు. అమరావతి పునఃప్రారంభానికి విచ్చేసిన ఆయనకు చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు చెప్పారు. "దివిసీమ తుపానులా గత ప్రభుత్వం అమరావతిని తుడిచేసింది. ధర్మయుద్ధంలో అమరావతి రైతులే విజయం సాధించారు. రాజధాని రైతుల పోరాటానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. అమరావతి రైతుల త్యాగాలను మరిచిపోలేం. వారి త్యాగాలకు జవాబుదారీగా ఉంటాం. రాజధాని నిర్మించి అమరావతి రైతుల రుణం తీర్చుకుంటాం. రైతులు భూములు ఇవ్వడం మాత్రమే కాదు.. రాష్ట్రానికి భవిష్యత్నిచ్చారు. అమరావతి ప్రపంచ స్థాయి సర్వశ్రేష్ఠ రాజధానిగా ఆవిర్భవిస్తుంది. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు ఉండటం వల్ల శరవేగంగా అభివృద్ధి జరుగుతుంది. భవిష్యత్తులో మన విద్యార్థులు బెంగళూరు, హైదరాబాద్ వలస వెళ్లరు. అందరం కోరుకున్నట్లే చంద్రబాబు సీఎం అయ్యారు. ఆయన పాలనా దక్షతతో అమరావతిని అద్భుత రాజధానిగా తీర్చిదిద్దుతాం. అమరావతి రాష్ట్రానికే కాదు.. దేశానికే తలమానికంగా నిలుస్తుంది. అమరావతికి సహకరిస్తున్న మోదీకి ధన్యవాదాలు. భవానీ మాత మోదీని మరింత శక్తిమంతున్ని చేయాలి"అని పవన్ ఆకాంక్షించారు.

'నా పక్కన శశి థరూర్.. వాళ్లకు నిద్రపట్టదేమో' :మోదీ వ్యంగ్యాస్త్రాలు

కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. తనతో పాటు శశిథరూర్ ఉండటంతో కొందరికి నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు.

తిరువనంతపురం, మే 2, (రిపబ్లిక్ న్యూస్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం కేరళలో పర్యటించారు. తిరువనంతపురం సమీపంలో రూ.8,900 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన విఝింజమ్ ఇంటర్నేషనల్ డీప్వాటర్ మల్టీపర్పస్ సీపోర్టును ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరువనంతపురం ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ హాజరయ్యారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. ప్రతిపక్ష పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఈ ఫొటో చూసి కొందరికి నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు.

"ఈ రోజు శశిథరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ ప్రోగ్రామ్ కొందమందికి నిద్ర లేని రాత్రిని మిగులుస్తుంది. ఈ సందేశం ఎక్కడికి వెళ్లాలో అక్కడికి వెళ్లిపోయింది" అని మోదీ పరోక్షంగా కాంగ్రెస్‌ను చమత్కరించారు. కాగా.. గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని థరూర్ వ్యక్తిగతంగా వెళ్లి స్వాగతించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారిన సంగతి తెలిసిందే. "దిల్లీ ఎయిర్పోర్టులో విమానాల ఆలస్యం ఉన్నప్పటికీ.. సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగా. నా నియోజకవర్గానికి వచ్చిన మోదీని సాదరంగా స్వాగతించా" అని థరూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ అధినాయత్వంతో శశిథరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ మధ్య ఓ కేంద్ర మంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారనున్నట్లు ప్రచారం మొదలైంది. ఇక, భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పరిణామాల వేళ ఆయన మోదీతో వేదిక పంచుకోవడం చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ సీపోర్ట్ కేరళలో ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యం, షిప్పింగ్లో భారత పాత్రను గణనీయంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1519 : గణిత శాస్త్రజ్ఞుడు, చిత్రకారుడు, శిల్పకారుడు, వృక్షశాస్త్రజ్ఞుడు, సంగీత కళాకారుడు లియొనార్డో డావిన్సి మరణం (జ.1452).
- 1911 : తెలుగు చిత్ర నిర్మాత, దర్శకుడు పి.పుల్లయ్య జననం (మ. 1987).
- 1921 : భారతీయ సినిమా దర్శకుడు సత్యజిత్ రే జననం (మ.1992). (చిత్రంలో)
- 1929 : తెలుగు వచన కవితా ప్రవీణులు పెనుమర్తి విశ్వనాథశాస్త్రి జననం (మ. 1998).
- 1969 : వెస్టిండీస్ క్రికెట్ ఆటగాడు బ్రియాన్ లారా జననం.
- 2011 : ఒసామా బిన్ లాదెన్ ను పాకిస్తాన్‌లో, అమెరికన్ సి.ఐ.ఏ. కాల్చి చంపింది.


లియొనార్డో డావిన్సి

పి.పుల్లయ్య

సత్యజిత్ రే

పెనుమర్తి విశ్వనాథశాస్త్రి

బ్రియాన్ లారా

ఒసామా బిన్ లాదెన్

దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్.. ఉత్తమ చిత్రంగా 'క'

'క' సినిమా ఖాతాలో మరో అవార్డు చేరింది. ఓ సంస్థ నిర్వహించే 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్లో ఇది ఉత్తమ చిత్రంగా నిలిచింది.

నటుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'క'. ఈ సినిమా అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. ఓ సంస్థ నిర్వహించే 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్ లో ఉత్తమ చిత్రంగా అవార్డును సొంతం చేసుకుంది. దీంతో చిత్ర బృందానికి నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. నూతన దర్శకులు సుజిత్, సందీప్ సంయుక్తంగా తెరకెక్కించారు. నయన్ సారిక, తన్వీ రామ్ కథానాయికలు. గతేడాది విడుదలైన ఈ చిత్రం పాజిటివ్ టాక్ను సొంతం చేసుకుంది. కిరణ్ అబ్బవరం కెరీర్లోనే బిగ్గెస్ట్ హిట్గా నిలిచి మంచి వసూళ్లు సాధించింది. 'క' విషయానికి వస్తే.. ఫాంటసీ థ్రిల్లర్గా రూపొందింది. డాల్బీ విజన్: ఆటమ్స్ టెక్నాలజీలతో తెరకెక్కించారు. అభినయ్ వాసుదేవ్ (కిరణ్ అబ్బవరం) అనాథ. ఇతరుల ఉత్తరాలు చదువుతూ.. తన సొంత వాళ్లే రాశారని ఊహించుకుంటూ జీవితాన్ని గడిపే వ్యక్తి. అలా ఓ రోజు ఉత్తరం చదువుతుండగా ఆ ఊళ్లో కనిపించకుండా పోయిన అమ్మాయిల గురించి ఓ విషయం తెలుస్తుంది. ఆ తర్వాత అతని జీవితంలో ఎలాంటి సంఘటనలు ఎదురయ్యాయి..? అనే నేపథ్యంలో సిద్ధమైన చిత్రమిది. దీనికి కొనసాగింపుగా 'క 2' ఉంటుందని ఇప్పటికే టీమ్ ప్రకటించింది. 'పార్ట్ 1'తో పోలిస్తే.. 'పార్ట్ 2' మరింత ఉత్కంఠగా సాగేలా చూస్తామని టీమ్ చెప్పింది.

ఓటీటీలోకి 'గుడ్ బ్యాడ్ అగ్లీ'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!

'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. నెట్ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది.

అజిత్ నటించిన తాజా యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఇటీవల విడుదలైన ఈ సినిమా మంచి టాక్ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. నెట్ఫ్లెక్స్ వేదికగా మే 8 నుంచి స్ట్రీమింగ్ కానుంది. అజిత్ సరసన త్రిష నటించిన ఈ సినిమాకు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. కథేంటంటే.. ఏకే అలియాస్ రెడ్ డ్రాగన్ (అజిత్) ప్రపంచంలోనే పేరు మోసిన గ్యాంగ్టర్. ఎన్నో ఏళ్లు చక్రవర్తిలా చీకటి సామ్రాజ్యాన్ని ఏలిన అతను.. భార్య రమ్య (త్రిష)కి ఇచ్చిన మాట కోసం ఆ నేర సామ్రాజ్యాన్ని వీడి జైలుకు వెళ్తాడు. అలా 17 ఏళ్లు జైలు జీవితం గడిపిన అతను.. బయటకు రాగానే తన కొడుకు విహాన్ (కార్తీక్ దేవ్)ను చూసేందుకు భార్యతో కలిసి స్పెయిన్కు వెళ్లేందుకు సిద్ధమవుతాడు. అయితే ఈలోగా ఏకేపై ఓ గ్యాంగ్ దాడి చేయగా.. దాని నుంచి త్రుటిలో తప్పించుకుంటాడు. మరోవైపు స్పెయిన్లో ఉన్న అతని కొడుకును ఓ ముఠా కిడ్నాప్ చేసి డ్రగ్స్ కేసులో జైలు పాలయ్యేలా చేస్తుంది. మరి తన కొడుకును కాపాడేందుకు ఏకే ఏం చేశాడు? అసలు తన కొడుకును టార్గెట్ చేసిన ముఠాకు.. ఏకేకూ ఉన్న విరోధం ఏంటి? కొడుకును కాపాడుకోవడం కోసం మళ్లీ తుపాకీ పట్టాడా? లేదా? అన్నది మిగిలిన కథ.

'స్పిరిట్' తర్వాతే 'యానిమల్ పార్క్'.. ఆ వార్తలకు చెక్

'స్పిరిట్' సినిమా అప్డేట్ను నిర్మాత భూషణ్ కుమార్ పంచుకున్నారు. దీంతో ప్రభాస్ అభిమానులు ఆనందిస్తున్నారు.

హీరో ప్రభాస్- డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్లో 'స్పిరిట్' రానున్న విషయం తెలిసిందే. దీన్ని అధికారికంగా ప్రకటించిన నాటినుంచే అభిమానుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుందంటూ కొన్ని వార్తలు ఇటీవల వైరల్ గా మారాయి. తాజాగా వాటిపై నిర్మాత భూషణ్ కుమార్ స్పష్టతనిచ్చారు. దీని చిత్రీకరణకు సంబంధించిన అప్డేట్ను పంచుకున్నారు. ప్రస్తుతం సందీప్ వంగా వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్'కు సీక్వెల్గా 'యానిమల్ పార్క్' తెరకెక్కనుంది. అయితే స్పిరిట్ కంటే ముందే 'యానిమల్ పార్క్' తెరకెక్కుతుందని కొన్ని రోజుల నుంచి వార్తలు వైరల్గా మారాయి. తాజాగా నిర్మాత భూషణ్ కుమార్ మాట్లాడుతూ వాటిని ఖండించారు. మరో రెండు, మూడు నెలల్లో 'స్పిరిట్' షూటింగ్ ప్రారంభం కానుందన్నారు. ఈ సినిమా తర్వాతే 'యానిమల్ పార్క్'ను రూపొందిస్తారని తెలిపారు. 2027లో రిలీజ్ చేయనున్నట్లు చెప్పారు. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ సంబర పడుతున్నారు. సందీప్ వంగా సినిమా కంటే ముందు ప్రశాంత్ వర్మతో ప్రభాస్ ఓ సినిమా చేయనున్నారని కూడా ఇటీవల సోషల్ మీడియాలో పోస్టు కనిపించాయి. తాజాగా భూషణ్ కుమార్ వెల్లడించిన అప్డేట్తో వాటికి చెక్ పడింది. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో వరుస సినిమాలు ఉన్నాయి. ఆయన నటించిన 'రాజాసాబ్' విడుదలకు సిద్ధంగా ఉంది. దీని తర్వాత 'స్పిరిట్', 'కల్కి 2', 'సలార్ 2'ల్లో నటించనున్నారు. వీటికంటే ముందు 'కన్నప్ప'లో అతిథి పాత్రలో కనిపించనున్నారు.

రిపబ్లిక్ దిన పత్రిక
9948814188, 9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

ఇదంతా మా స్వయంకృతాపరాధమే :రియాన్ పరాగ్

'చాలావరకు మాకు శుభారంభాలే దక్కుతున్నాయి. కానీ మా స్వయంకృతాపరాధాలతో మేం వెనకబడుతున్నాం. ఇక మిడిలార్డర్ విషయానికొచ్చేసరికి నేను, ధ్రువ్ జురేల్ కొన్ని తప్పులు చేశాం' అంటున్న రియాన్ పరాగ్



రాజస్థాన్ రాయల్స్ ఈ ఐపీఎల్ సీజన్లో ఎనిమిదో పరాజయాన్ని చవిచూసింది. తాము ఆడిన 11 మ్యాచుల్లో కేవలం మూడింట్లో మాత్రమే విజయం సాధించింది. గురువారం ముంబయి ఇండియన్స్‌తో జరిగిన ఏకపక్ష మ్యాచ్లో 100 పరుగుల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబయి జట్టు 2 వికెట్ల నష్టానికి 217 రన్స్ చేసింది. 218 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ 16.1 ఓవర్లలో 117 పరుగులకే ఆలౌటైంది. టాప్ ఆర్డర్, మిడిలార్డర్ విఫలమైంది. జోఫ్రా ఆర్చర్ 30 పరుగులతో టాప్ స్కోరర్గా నిలిచాడు. గత మ్యాచ్లో సెంచరీతో చెలరేగిన ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఈసారి డకౌట్గా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ జైస్వాల్ కూడా 13 పరుగులతో సరిపెట్టుకున్నాడు. "200కు పైన పరుగులు ఛేజ్ చేయడం కాస్త కష్టమే. చాలావరకు మాకు శుభారంభాలే దక్కుతున్నాయి. కానీ మా స్వయంకృతాపరాధాలతో మేం వెనకబడుతున్నాం. ఇక మిడిలార్డర్ విషయానికొచ్చేసరికి నేను, ధ్రువ్ జురేల్ కొన్ని తప్పులు చేశాం. మేం వాటిమీద దృష్టి పెట్టాలనుకుంటున్నాం. మా లోపాలను సరిదిద్దుకోవాలనుకుంటున్నాం' అని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ అన్నాడు. ఇదిలాఉండగా ముంబయి ఇండియన్స్ వరుసగా ఆరు విజయాలతో దూసుకుపోతోంది. 14 పాయింట్లతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వెనక్కి నెట్టి, మెరుగైన రన్రేట్ సాయంతో పాయింట్ల పట్టికలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.

ఇంటి చిట్కాలు

నోరూరించే ద్రాక్ష పండ్ల పచ్చడి రెసిపీ.., ఇడ్లీ వడల్లోకి నంచుకుని తినొచ్చు

మనం రకరకాల పచ్చళ్లు చేస్తుంటాం. అదే విధంగా ద్రాక్షలతోనూ చట్నీ చేసుకోవచ్చు. ఎలాంటి శ్రమ పడాల్సిన పని లేకుండా చాలా సులభంగా చేసుకునే రెసిపీ ఒకటి ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. ఆ రెసిపీ ఏంటో ఓ సారి చూద్దాం.

ద్రాక్ష పండ్లు అంటేనే నోరూరిపోతుంది. చాలా టేస్టీగా ఉండడంతో పాటు సులువుగా జీర్ణమైపోతాయి. వీటిలో ఎన్నో పోషకాలుంటాయి. విటమిన్ ఎ, విటమిన్ సి తో పాటు యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండడం వల్ల ఎలాంటి అనారోగ్యాలు దరి చేరనివ్వదు. ఇందులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలోని కణాలు దెబ్బ తినకుండా కాపాడతాయి. అంతే కాదు. గుండెకి సంబంధించిన ఇబ్బందులేవీ తలెత్తకుండా చూస్తాయి. అందుకే అందరూ తప్పనిసరిగా ద్రాక్ష పండ్లు తినాలని వైద్యులు సూచిస్తుంటారు. డైట్ ఫాలో అవుతున్న వాళ్లైతే తప్పకుండా తినాల్సిన ఫ్రూట్స్ ఇవి.అయితే..ఎప్పుడూ రొటీన్ గా తిని బోర్ కొడితే ద్రాక్షలతో మరి కొన్ని రెసిపీలు ట్రై చేయొచ్చు. అందులో ఉన్న పోషకాలు ఎక్కడికీ పోకుండా ఇంకాస్త రుచికరంగా తయారు చేసుకుని తినొచ్చు. మనం రకరకాల పచ్చళ్లు చేస్తుంటాం. అదే విధంగా ద్రాక్షలతోనూ చట్నీ చేసుకోవచ్చు. ఎలాంటి శ్రమ పడాల్సిన పని లేకుండా చాలా సులభంగా చేసుకునే రెసిపీ ఒకటి ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. ఆ రెసిపీ ఏంటో ఓ సారి చూద్దాం.



గ్రేప్ చట్నీ

ద్రాక్షలతో పచ్చడేంటని కాస్తంత వింతగా అనిపిస్తుందొచ్చు. కానీ..ఎప్పుడూ ఒకేలా కాకుండా కాస్తంత విభిన్నంగా ఏదైనా ట్రై చేయాలనుకునే వాళ్లకి మాత్రం ఇది బాగానే నచ్చుతుందొచ్చు. ఈ పచ్చడి తయారు చేసుకోవడానికి కావాల్సిన పదార్థాలేంటంటే..ద్రాక్ష పండ్లు, చక్కెర, ఉప్పు, కారం, ధనియాల పొడి, నీళ్లు. ఇంతకు మించి ఇంకే పదార్థాలూ అవసరం లేదు. పండ్లలో ఉన్న పోషకాలు, మినరల్స్ కోల్పోకుండా ఈ పచ్చడి తయారు చేసుకోవచ్చు. అయితే..చక్కెర, కారం మాత్రం ఎవరికి అవసరమైనంత వాళ్లు వేసుకోవాల్సి ఉంటుంది. కాస్తంత కారంగా తినాలనుకునే వాళ్లు..కాస్త ఎక్కువగా వేసుకుంటే సరిపోతుంది.

ఎలా తయారు చేసుకోవాలి

ముందుగా కొన్ని ద్రాక్ష పండ్లు తీసుకోవాలి. వాటిని ప్యాన్ లో వేసుకోవాలి. అందులోనే ఓ టేబుల్ స్పూన్ చక్కెర, టేబుల్ స్పూన్ ఉప్పు వేయాలి. ఆ తరవాత ఓ స్పూన్ మేర కారం వేసుకోవాలి. వీటన్నింటినీ బాగా కలిపిన తరవాత ధనియాల పొడి యాడ్ చేసుకోవాలి. ఇది జీర్ణ శక్తిని పెంచడంతో పాటు చట్నీకి రుచి కూడా ఇస్తుంది. వీటన్నింటినీ బాగా మిక్స్ చేసి ఆ తరవాత అందులో నీళ్లు పోయాలి. కాసేపు మరిగించాలి. ద్రాక్ష పండ్లు ఉడికిన తరవాత వాటిని చిదమాలి. అంటే పచ్చడిగా తయారయ్యేలా మెత్తగా చేసుకోవాలి. కొద్ది సేపు అలాగే వేడి చేయాలి. కాసేపటికి నీరు అంతా గుంజుకుని పేస్ట్ లా తయారవుతుంది.

రుచి కోసం అల్లం

ఈ ద్రాక్ష పచ్చడి ఇంకా రుచిగా ఉండాలంటే కాస్తంత అల్లం యాడ్ చేసుకోవచ్చు. అల్లం వేయడం వల్ల టేస్ట్ రావడంతో పాటు పచ్చడి కొద్ది రోజులైనా నిల్వ ఉంటుంది. పైగా అల్లంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు శరీరానికి మంచి చేస్తాయి. కీళ్ల నొప్పులు తగ్గించడంతో పాటు జీర్ణ శక్తిని మెరుగుపరుస్తాయి. అయితే ఇందులో మనం రోజూ వంటకు వాడే మామూలు ఉప్పు కాకుండా బ్లాక్ సాల్ట్, హిమాలయన్ సాల్ట్ లాంటివి వాడితే ఇంకా మంచిది. కావాలంటే కాస్తంత పసుపు కూడా వేసుకుని చట్నీ చేసుకోవచ్చు. అయితే..కొంత మంది ద్రాక్షలను నూనెలో కాస్తంత రోస్ట్ చేసి ఆ తరవాత చట్నీ చేసుకుంటారు. ఈ రెసిపీ కూడా ట్రై చేయొచ్చు. అయితే నూనె ఎందుకు వాడాలనుకుంటే మాత్రం కేవలం నీళ్లలో ఉడకబెట్టి పచ్చడి చేసుకుంటే సరిపోతుంది.

ఎలా తినొచ్చు

ఈ గ్రేప్ చట్నీని అన్నంలో కాకుండా స్నాక్స్ లో నంచుకుని తింటే చాలా టేస్టీగా అనిపిస్తుంది. చాట్, పకోడి, సమోసా, కచోరి లాంటి వాటితో తినొచ్చు. అయితే..ఆయిల్ ఫుడ్ ని అవాయిడ్ చేసే వాళ్లు మాత్రం చపాతీలు, పుల్కాలతో పాటు నంచుకుని తింటే ఎంతో ఆరోగ్యం. పిల్లలు ఈ చట్నీని చాలా ఇష్టంగా తింటారు. కాస్తంత తీపి, పుల్లదనం కలిసి ఉండడం వల్ల కమ్మగా అనిపిస్తుంది. పిల్లలకు బ్రెడ్, సాండ్ విచ్ లాంటివి పెట్టినప్పుడు దీన్ని సైడ్ డిష్ గా చేర్చుకోవచ్చు. ఇడ్లీ, వడ చేసుకున్నప్పుడు ప్రతిసారీ పల్లీల చట్నీతోనే కాకుండా ఇలా ద్రాక్ష పండ్లతో పచ్చడి చేసుకుని నంచుకోవచ్చు. పల్లీలు అతిగా తినడం మంచిది కాదు. దానికి బదులుగా అప్పుడప్పుడూ ఈ చట్నీ చేసుకుంటే బాగుంటుంది.

లాభాలివే

గ్రేప్స్ చట్నీతో ఎన్నో లాభాలున్నాయి. తరచూ తినడం వల్ల విటమిన్ సి తో పాటు విటమిన్ కె శరీరానికి పుష్కలంగా అందుతుంది. శరీరంలో రక్తం గడ్డ కట్టుకుపోవడాన్ని విటమిన్ కె నియంత్రిస్తుంది. విటమిన్ సి కండరాల సమస్యలని పోగొడుతుంది. ద్రాక్షలో ఉండే ఫ్లేవనాయిడ్స్ క్యాన్సర్ ముప్పుని తగ్గిస్తాయి. ఆ కణాలతో పోరాడతాయి. అంతే కాకుండా బాడీలో కొలెస్ట్రాల్ ని తగ్గించి బీపీని కూడా కంట్రోల్ చేస్తాయి.

గమనిక

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.